క్లుప్తంగా

కార్పొరేటర్‌కు ఎమ్మెల్యే పరామర్శ



కార్పొరేటర్ అప్పారావుతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

కొమ్మాది: జీవీఎంసీ 8వ వార్డు కార్పొరేటర్ లొడగల అప్పారావును ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు గురువారం పరామర్శించారు. కార్పొరేటర్ గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి గురువారం గొల్లల ఎండాడలోని నివాసానికి వెళ్లి అప్పారావు యోగ క్షేమాలు తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఆయనవెంట వైఎస్సార్ సీపీ వార్డు అధ్యక్షుడు గుడ్ల పోలిరెడ్డి, స్థానిక నాయకులు అల్లాడ ఉమామహేశ్వర రావు, ఉప్పులూరి గోపి, చెన్నాదాసు, నొడగల రాంబాబు, మాదు బుజ్జి, వంశీకృష్ణ తదితరులు ఉన్నారు.

పూరిల్లు దగ్ధం

కొమ్మాది: జీవీఎంసీ 5వ వార్డు మారికవలస శారదానగర్‌లో గురువారం ఓ పూరిల్లు దగ్ధమైంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... గండిబోయిన పైడిరాజు అనే వ్యక్తి కుటుంబంతో ఇక్కడ నివసిస్తున్నారు. కూలి పనులు చేసుకుని జీవనం సాగిస్తున్న వీరు ఉదయం పనుల నిమిత్తం బయటకు వెళ్లిపోయారు. ఎవరూ లేని సమయంలో మధ్యాహ్నం ఈ పూరిల్లు నుంచి ఒక్కసారిగా మంటలు వ్యాపించడంతో స్థానికులు అప్రమత్తమై అదుపు చేసేందుకు ప్రయత్నించినప్పటికీ పూర్తిగా దగ్ధమైపోయింది. షార్టు సర్క్యూట్ వల్ల ప్రమాదం సంభవించిందని బాధితులు తెలిపారు. ప్రమాదంలో దుస్తులు, ఎలక్ట్రికల్ సామగ్రి, కొంతమేర నగదు పూర్తిగా కాలిపోయాయని, సుమారు రూ. 60 వేల ఆస్తి నష్టం వాటిల్లినట్లు పైడిరాజు తెలిపారు.

విగ్రహాల ప్రతిష్ట నేడు



విగ్రహాలకు పూజలు చేస్తున్న అర్చకులు

భీమునిపట్నం: స్థానికంగా శ్రీ సీతారామ లక్ష్మణ సహిత షణ్ముఖ సుబ్రహ్మణ్య స్వామి నాగబంధ ప్రతిష్ట మహోత్సవంలో భాగంగా గురువారం ప్రత్యేక పూజలు చేశారు. శుక్రవారం విగ్రహాలు ప్రతిష్ఠించనున్నారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

తగరపువలస: చిట్టివలస విద్యుత్ సబ్ స్టేషన్ 11 కేవీ తాళ్లవలస ఫీడర్ పరిధిలో శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏఈఈ బొట్ట రవి తెలిపారు. ఈ అంతరాయం కారణంగా సంగివలస ఎన్ఆర్ఐ ఆస్పత్రి డబుల్ రోడ్డు, సుఖీభవ కాలనీ, వలందపేట, రాజుల తాళ్లవలస, తిరుమల కళాశాల, గొల్లల తాళ్లవలస గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని తెలిపారు.

రెండు గడ్డి కుప్పలు దగ్ధం

కొమ్మాది: జీవీఎంసీ 4వ వార్డు కె.నగరపాలెం జంక్షన్ నరసింహనగర్‌లో గురువారం రాత్రి రెండు గడ్డి కుప్పలు దగ్ధమయ్యాయి. ఈ ప్రాంతానికి చెందిన గరికిన అప్పలరాజు, బాడిదబోయిన రాములు తమ ఆవుల మేత కోసం ఇక్కడ ఇటీవల ఒక్కొక్కటి రూ. 20 వేలు చొప్పున రెండు గడ్డి కుప్పలను కొనుగోలు చేసి నిల్వ చేసుకున్నారు. రాత్రి 9 గంటల సమయంలో ఒక్కసారిగా రెండు గడ్డి కుప్పలు పూర్తిగా దగ్ధమైపోయాయి. ఇక్కడికి సమీపంలోని ఓ పార్కుకు వచ్చిన యువకులు సిగరెట్ కాల్చి పడేయడంతో అగ్నికి ఆహుతయ్యాయని బాధితులు ఆరోపిస్తున్నారు. విషయం తెలుసుకున్న స్థానికులు సంఘటనా స్థలానికి చేరుకుని ఐఎన్ఎస్ కళింగ అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వగా వారు మంటలను అదుపు చేశారు.

వంతెన నిర్మాణ పనులు షురూ

- గోస్తనీలో మట్టితో పూడ్చివేత ఆరంభం
- ఆరు నెలల్లో అందుబాటులోకి తీసుకొచ్చేందుకు ప్రణాళికలు



ఎల్లారమ్మ మెట్ట వద్ద ఏర్పాటు కానున్న వంతెన అప్రోచ్ మార్గం



గొల్లలపాలెం వద్ద మట్టితో నదిని పూడుస్తున్న పొక్లెయిన్

తగరపువలస: భీమిలి మండలం టి.నగరపాలెం వద్ద గోస్తనీ నదిపై రూ.2.96 కోట్లతో నిర్మించనున్న వంతెన నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. ఎల్లారమ్మ మెట్టకు అనుసంధానంగా వంతెన నిర్మించి తగరపువలస హైవేకు అప్రోచ్ రహదారిని కూడా పూర్తి చేస్తారు. ఆరు మాసాల్లో పూర్తి కానున్న ఈ వంతెన నిర్మాణ పనులలో భాగంగా ముందుగా నదిలో మట్టితో ఒకవైపు నుంచి పూడ్చుకుని వస్తున్నారు. ప్రస్తుతం గొల్లలపాలెం వైపు ఉన్న 20 అడుగుల లోతైన భాగాన్ని పూడ్చడానికి 300 లారీల మట్టిని వినియోగించారు. మొత్తం ఎల్లారమ్మ మెట్ట వరకు నదిలో వెయ్యి లారీల వరకు మట్టి వినియోగించనున్నారు. దీనికి ముందు నదీ ప్రవాహానికి ఆటంకం కలగకుండా పైపులు ఏర్పాటు చేయనున్నారు. రెండు మాసాల్లో ఈ పని పూర్తి చేసిన తర్వాత నదిలో తొమ్మిది పిల్లర్లతో వంతెన నిర్మాణ పనులు చేపట్టనున్నారు. ప్రస్తుత అంచనాల ప్రకారం మరో రూ.50 లక్షల వరకు వ్యయం పెరగనుంది. భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు చొరవతో చిప్పాడ దివీస్ లేబొరేటరీ యాజమాన్యం వంతెన నిర్మాణ వ్యయం భరించనుంది.

దశాబ్దాల కష్టాలకు తెర..

తగరపువలసను ఆనుకుని గోస్తనీ నదికి అవతలి వైపు ఉన్న టి.నగరపాలెం, తాటితూరులో వేలాది ఎకరాల వ్యవసాయ భూములు ఉన్నాయి. వీటి సాగు కోసం నిత్యం వందలాది మంది రైతులు, వ్యవసాయ కూలీలతోపాటు తాటితూరు పక్కనే ఉన్న మజ్జివలస తదితర పంచాయతీల ప్రజలు, విద్యార్థులు, వ్యాపారులు, మత్స్యకారులు నదిని దాటాల్సి వస్తుంది. నదిలో పడవలు అందుబాటులో ఉంటే సరిపోయేది. లేదంటే చుట్టూ తిరిగి మహరాజుపేట, అవంతి కళాశాల కూడలి మీదుగా వాహనాలపై రాకపోకలు సాగించాల్సి వచ్చేది. ఇది వ్యయ ప్రయాసలతో కూడుకున్న వ్యవహారంతోపాటు రాంగ్‌రూట్ కారణంగా ప్రమాదాలకు ఆస్కారం ఉండేది. వంతెన అందుబాటులోకి వస్తే కేవలం 500 మీటర్ల దూరంలో ఉన్న తగరపువలసకు సులువుగా చేరుకోవచ్చు. నదిలో నీరు లేకపోయినప్పుడు కాళ్లు కాల్చే ఇసుకలో నుంచి ఇరువైపుల ప్రజలు రాకపోకలు సాగించేవారు. వంతెన నిర్మాణం పూర్తయితే చెక్‌డ్యామ్ లేకుండానే ఈ ప్రాంతంలో తాగు, సాగునీటి వనరులు పుష్కలంగా లభిస్తాయని స్థానికులు అంటున్నారు.

వంతెన నిర్మాణం వైఎస్సార్‌సీపీ చలవే



2019 ఎన్నికల సమయంలో ఇక్కడి ప్రజలకు ఇచ్చిన హామీ ప్రకారం భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు వంతెన నిర్మాణానికి పూనుకున్నారు. శిలాఫలకం తర్వాత సాంకేతిక కారణాలతో జాప్యం జరిగినా పనులు ప్రారంభించారు. ఇన్నాళ్లూ సాకారం కాని కల ఒక్క వైఎస్సార్‌సీపీతోనే సాధ్యమైందని ఇక్కడి ప్రజలు కొనియాడుతున్నారు.

– పి.చంద్రశేఖర్, భీమిలి బీసీ సెల్ నాయకుడు

ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నాం



మా గ్రామ పంచాయతీల ప్రజలు రవాణా వసతులు లేని సమయంలో నదిని దాటడానికి ఎన్నో కష్టాలు పడ్డారు. విద్యార్థులు, జ్యూట్ కార్మికులు నదిలో మునిగిన సందర్భాలున్నాయి. ఎర్రటి ఎండలో కాలే ఇసుకలో నడిచిన సందర్భాలు చూశాం. మరో ఆరునెలల్లో ఆ కష్టాలన్నీ తీరనున్నాయి. ఇప్పుడు తగరపువలస మాకు మరింత చేరువ కానుంది.

– రాజగిరి రామచంద్రరావు, టి.నగరపాలెం

అర్హులందరికీ సంక్షేమ పథకాలు



మహిళకు సంక్షేమ పథకాల కరపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

కొమ్మాది: వివక్షకు తావులేకుండా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నారని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు తెలిపారు. జీవీఎంసీ 5వ వార్డు మారికవలస రాజీవ్ గృహకల్పలో గురువారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాల ద్వారా చేకూరిన లబ్ధిని వివరించారు. ప్రజా సమస్యలు అడిగి తెలుసుకుని అక్కడికక్కడే పరిష్కరించేందుకు చర్యలు చేపట్టారు. అనంతరం ఎమ్మెల్యే శ్రీనివాసరావు మాట్లాడుతూ చంద్రబాబు హయాంలో టీడీపీ జెండా పట్టుకున్న వారికి మాత్రమే ప్రభుత్వ పథకాలు అందేవన్నారు. ప్రస్తుతం వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో పేదరికం, అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందరికీ అందిస్తున్నామని వెల్లడించారు. అందుకే ఎక్కడికి వెళ్లినా ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారన్నారు. గెలిచిన తర్వాత మేనిఫెస్టోను పట్టించుకోని ఘనత చంద్రబాబుకే దక్కిందని విమర్శించారు. నాలుగేళ్లలోనే 95 శాతం హామీలు నెరవేర్చిన ఖ్యాతి ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డికి దక్కిందన్నారు. ఈ సందర్భంగా తమ కాలనీల్లో జీవీఎంసీ సరఫరా చేస్తున్న తాగునీరు ఉదయం గంట సమయం మాత్రమే వస్తుందని, మరో గంట అదనంగా అందించాలని, ఇక్కడ అంగన్‌వాడీ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని మహిళలు కోరారు. వర్షాలు కురిసినప్పుడు మురుగనీరు రోడ్లపైకి వస్తోందని, ప్రత్యామ్నాయం ఏర్పాటు చేయాలని, ఈ ప్రాంతాల్లో కుక్కల బెడద ఎక్కువగా ఉందని, నియంత్రణ చర్యలు తీసుకోవాలని స్థానికులు ఎమ్మెల్యేను కోరగా... సమస్యలన్నీ తక్షణమే పరిష్కరించాలని అధికారులను ఆయన ఆదేశించారు. కార్యక్రమంలో జోనల్ కమిషనర్ కనక మహాలక్ష్మి, మాజీ కార్పొరేటర్ పోతిన హనుమంతరావు, జేఎస్ రెడ్డి, పోతిన సురేష్ తదితరులు పాల్గొన్నారు.

బాగ్యేష్‌కు పలువురి అభినందనలు



గోల్డ్ మెడల్ సాధించిన కోలా బాగ్యేష్

తగరపువలస: అనంతపురం జిల్లాలో ఈ నెల 6 నుంచి 8 వరకు జరిగిన జాతీయ మినీ సబ్ జూనియర్ సాఫ్ట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీల్లో భీమిలికి చెందిన కోలా బాగ్యేష్ గోల్డ్‌మెడల్ గెలుచుకున్నారు. అండర్ – 13 విభాగంలో రాష్ట్రం తరఫున ఎంపికైన బాగ్యేష్ ఈ పోటీల్లో పాల్గొన్నాడు. చదువుతోపాటు సాంస్కృతిక కార్యక్రమాలు, క్రీడల్లో మెరుగైన ప్రావీణ్యత సాధిస్తున్నందున భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, సెయింట్ ఫ్రాన్సిస్ స్కూల్ యాజమాన్యం, వాల్తేర్ సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ చైర్మన్ మామిడి రమణ, కార్యదర్శి సూర్యనారాయణ తదితరులు అభినందించారు.

ఈదురు గాలులతో వర్షం

తగరపువలస: భీమిలి నియోజకవర్గంలో గురువారం సాయంత్రం అర గంటపాటు ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. ఈ గాలులకు దుమ్ము లేచిపోయి తేలికగా ఉన్న వస్తువులు గాలిలో తేలియాడాయి. చెట్లు భయానకంగా ఊగాయి. దీంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. పగలంతా వేడి గాలులతో సతమతమైన ప్రజలకు చల్లటి గాలులు ఉపశమనం కలిగించాయి. తర్వాత వాతావరణం అనుకూలించడంతో విద్యుత్ సరఫరా పునరుద్ధరించారు.

సముద్ర జలాల పరిరక్షణతోనే మనుగడ సాధ్యం



భీమిలి తీరంలో సేకరించిన వ్యర్థాలతో జెడ్సీ రాము, తదితరులు



సాగర్‌నగర్ బీచ్‌లో సేకరించిన వ్యర్థాలతో జూ సిబ్బంది

భీమునిపట్నం: ప్రతి ఒక్కరూ వ్యక్తిగత బాధ్యతగా సముద్ర జలాలు కాపాడుకోవాలని, అప్పుడే జీవరాశి మనుగడ బాగుంటుందని జోనల్ కమిషనర్ బొడ్డేపల్లి రాము అన్నారు. గురువారం ప్రపంచ సముద్ర దినోత్సవం సందర్భంగా అసోసియేషన్ ఆఫ్ పీపుల్ పవర్ ఆధ్వర్యంలో భీమిలి బీచ్‌లో నిర్వహించిన బీచ్ క్లీన్ డ్రైవ్‌లో ఆయన పాల్గొని వ్యర్థాలు సేకరించారు.

ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తి స్థాయిలో నిషేధించాలని, అప్పుడే పర్యావరణం, పచ్చదనం పరిరక్షించగలమన్నారు. కార్యక్రమంలో పీపుల్స్ పవర్ సభ్యులు భాస్కర్, శానిటరీ సిబ్బంది, పార్లే ఫర్ ఇండియా సభ్యులు పాల్గొన్నారు.

కొమ్మాది: ప్రపంచ మహా సముద్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం బీచ్‌లు శుభ్రం చేసేందుకు పలు సంస్థలు ముందుకొచ్చాయి. ఇందులో భాగంగా సాగర్‌నగర్ బీచ్‌లో ఇందిరా గాంధీ జూలాజికల్ పార్కు సిబ్బంది సముద్ర తీరంలో ఉన్న వ్యర్థాలు తొలగించారు. ఈ సందర్భంగా జూ క్యూరేటర్ డాక్టర్ నందిని సలారియా మాట్లాడుతూ ప్రజల్లో పర్యావరణ పరిరక్షణపై మరింత అవగాహన పెరగాలని, సముద్రాలను కూడా కాపాడుకోవాలని సూచించారు. రుషికొండ బీచ్‌లో లివిన్ అడ్వెంచర్స్ ఆధ్వర్యంలో వ్యర్థాలు సేకరించారు. అడ్వెంచర్స్ సీఈవో బలరామ్ నాయుడు ఆధ్వర్యంలో స్కూబా డైవింగ్, అండర్ వాటర్ క్లీనింగ్ నిర్వహించి సముద్ర గర్భంలో గల ప్లాస్టిక్ వ్యర్థాలను కూడా తొలగించారు.

బంగ్లామెట్ట వద్ద బస్ షెల్టర్లు



బంగ్లామెట్ట శివాలయం వద్ద జీవీఎంసీ నిర్మించిన బస్ షెల్టర్

తగరపువలస: ప్రయాణికులు, విద్యార్థుల సౌకర్యార్థం జీవీఎంసీ భీమిలి జోన్ ఒకటో వార్డు బంగ్లామెట్ట వద్ద బస్ షెల్టర్లు నిర్మించారు. గతంలో విజయనగరం, శ్రీకాకుళం వైపు వెళ్లే ప్రయాణికుల కోసం వెంకటేశ్వరమెట్టను ఆనుకుని షెల్టర్ నిర్మించగా ఇప్పుడు శివాలయం వద్ద షెల్టర్లు నిర్మించారు. తగరపువలస నుంచి సిటీ బస్సుల ద్వారా ముఖ్యంగా నగరానికి వెళ్లే విద్యార్థులు వెంకటేశ్వర మెట్ట నుంచి బంగ్లామెట్ట మీదుగా అంబేడ్కర్ కూడలికి నడుచుకుంటూ వస్తున్నారు. అంబేడ్కర్ కూడలిలో అనువైన ప్రదేశం లేకపోవడంతో షెల్టర్ల నిర్మాణం జరగలేదు. అంతేకాకుండా కూడలిలో ఆర్టీసీ సిబ్బందికి విశ్రాంతి ప్రదేశాలు, టాయిలెట్లు లేకపోవడంతో బస్సులను నేరుగా బంగ్లామెట్ట శివాలయం ఎదురుగా చెట్ల కింద నిలుపుతున్నారు. బస్సులు కూడా ఇక్కడి నుంచే బయలుదేరుతాయి. దీంతో వీటికి చేరువలో నిర్మించిన బస్‌షెల్టర్‌లు ప్రయాణికులు, విద్యార్థులకు అనువుగా ఉండనున్నాయి. టీడీపీ ప్రభుత్వం 2015లో బంగ్లామెట్ట వద్ద డిపో, ఆర్టీసీ కాంప్లెక్స్ నిర్మాణం చేపడతామని శిలాఫలకం వేసి ఇక్కడి ప్రజలను మోసం చేసిన సంగతి తెలిసిందే.

ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత



బోని శివాలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

ఆనందపురం : అందరూ ఆధ్యాత్మిక చింతన అలవర్చుకుంటే మానసిక ప్రశాంతత లభిస్తుందని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని బోని అమరేశ్వర ఆలయం ప్రాంగణంలో గురువారం ఆగమ పండితులు బ్రహ్మశ్రీ అంపోలు ఉమామహేశ్వర శర్మ ఆధ్వర్యంలో ధ్వజస్తంభం ప్రతిష్ట కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఏ గ్రామంలో అయితే దేవాలయాల్లో నిత్య పూజలు జరుగుతాయో ఆ ప్రాంతం సుభిక్షంగా ఉంటుందన్నారు. శిథిలమైన ధ్వజ స్తంభం స్థానంలో కొత్తది ఏర్పాటు చేయడం వల్ల జయం కలుగుతుందన్నారు. ఈ సందర్భంగా నవగ్రహ, చండీశ్వర భైరవ, గణపతి, పార్వతి, నాగబంధ ప్రతిష్ట కార్యక్రమంతోపాటు హోమాలు, పూర్ణాహుతి, కళాన్యాసం, దృష్టికుంభం, సామూహిక వ్రతాలు నిర్వహించారు. అనంతరం గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మధ్యాహ్నం అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో భీమిలి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బోని అప్పలనాయుడు, సర్పంచ్ బోని అప్పలకొండ, ఎంపీటీసీ సభ్యురాలు బోని పార్వతి, ఆలయ కమిటీ చైర్మన్ కాళ్ల వల్లంనాయుడు, మాజీ సర్పంచ్ బోని సూర్యనారాయణ, జెడ్పీటీసీ సభ్యుడు కోరాడ వెంకటరావు, నాయకులు బోని సన్యాసినాయుడు, మజ్జి వెంకటరావు, పాండ్రింకి అప్పారావు, పాండ్రింకి శ్రీను, పిన్నింటి వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ యార్డు స్థలంలోని బడ్డీల తొలగింపు



మార్కెట్ యార్డు ముందు భాగంలో ఉన్న బడ్డీలను తొలగిస్తున్న సిబ్బంది

ఆనందపురం : ఆనందపురం జంక్షన్‌లోని వ్యవసాయ మార్కెట్ యార్డు స్థలంలో ఉన్న బడ్డీలను మార్కెట్ కమిటీ పాలకవర్గం ఆదేశాల మేరకు గురువారం తొలగించారు. రెండు రోజులుగా ఈ తొలగింపు ప్రక్రియ జరుగుతోంది. భీమిలి వ్యవసాయ మార్కెట్ కమిటీకి అనుబంధంగా 15 ఏళ్ల క్రితం ఇక్కడ యార్డుకి స్థలం కేటాయించారు. ఆ యార్డు చుట్టూ ప్రహరీ నిర్మించి గేట్ ఏర్పాటు చేశారు. రోజువారీ మార్కెట్ రోడ్డు వైపు పార్కింగ్ కోసం సుమారు 30 అడుగుల వెడల్పున స్థలాన్ని విడిచి పెట్టారు.

ఆ స్థలం చుట్టూ కంచె ఏర్పాటు చేశారు. అయితే కంచెను తొలగించి మరీ ఆ స్థలాన్ని కొంతమంది ఆక్రమించి శాశ్వతంగా బడ్డీలు, దుకాణాలు ఏర్పాటు చేసుకొని దర్జాగా వ్యాపారాలు నిర్వహిస్తున్నారు. అందులో చాలా మంది ఇతర ప్రాంతాల నుంచి వచ్చి మరీ స్థలాలను ఆక్రమించి వ్యాపారాలు చేసుకుంటున్నారు. కాగా మార్కెట్ యార్డు ముందు భాగంలో బడ్డీలు ఏర్పాటు చేయడం వల్ల యార్డు లోపలకి కూడా వెళ్లలేని పరిస్థితి నెలకొంది. దీంతో మార్కెట్ కమిటీ పాలకవర్గం రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు రెవెన్యూ అధికారులు పోలీసుల సహకారంతో బడ్డీలను తొలగించారు. మరలా అక్కడ కంచె ఏర్పాటు చేయడానికి చర్యలు చేపడుతున్నారు.

కిడ్నీ వ్యాధులపై పరిశోధనలకు హెచ్ఎంఎస్ సహకారం

- ప్రముఖ నెఫ్రాలజిస్ట్, వైఎస్సార్ హెల్త్ యూనివర్సిటీ విశ్రాంత వీసీ రవిరాజ్

మహారాణిపేట : శ్రీకాకుళం జిల్లా ఉద్దానం కిడ్నీ వ్యాధులపై చేస్తున్న పరిశోధనలకు అమెరికాలోని హార్వర్డ్ మెడికల్ స్కూలు (హెచ్ఎంఎస్) సాంకేతిక సహకారం అందించేందుకు ముందుకొచ్చిందని ప్రముఖ నెఫ్రాలజిస్టు, వైఎస్సార్ హెల్త్ యూనివర్సిటీ విశ్రాంత ఉప కులపతి, విశ్రాంత డీఎంఈ డాక్టర్ టి.రవిరాజ్ తెలిపారు. అమెరికా పర్యటనలో ఉన్న డాక్టర్ రవిరాజ్ హార్వర్డ్ మెడికల్ స్కూలును సందర్శించారు. అక్కడి నెఫ్రాలజీ విభాగం ఆహ్వానం మేరకు అమెరికా వెళ్లిన ఆయన ఉద్దానం కిడ్నీ వ్యాధులపై తాను చేస్తున్న పరిశోధనలకు సహకారం అందించాలని కోరారు. దీనికి హెచ్ఎంఎస్ నెఫ్రాలజీ విభాగం నుంచి సానుకూల సంకేతాలు అందాయి.

ప్రభుత్వం అనుమతి ఇస్తే పలాసలో కొత్తగా నిర్మిస్తున్న కిడ్నీ ఆస్పత్రి, పరిశోధన కేంద్రంలో వారి సహకారం ఉపయోగించుకోవచ్చని డాక్టర్ రవిరాజ్ తెలిపారు. 1995 నుంచి 2000 మధ్యలో ఉద్దానం నుంచి కేజీహెచ్‌కు ఎక్కువ కిడ్నీ బాధితులు వచ్చేవారని ఆయన తెలిపారు. దీంతో ఉద్దానం వెళ్లి వైద్య శిబిరాలు నిర్వహించామన్నారు. తమ పరిశోధనలో అక్కడి ప్రజల్లో 18.5 శాతం మంది కిడ్నీ బాధితులు ఉన్నారని గుర్తించామన్నారు. సాధారణంగా షుగర్, బీపీ వంటి వ్యాధుల వల్ల కిడ్నీ సమస్యలు వస్తాయని, కాని ఉద్దానంలో అలాంటి సమస్యల వల్ల రాలేదన్నారు. నీరు, ఆహారం, మెటల్స్, భూమిని పరీక్షించామని, ఆయా పరీక్షల్లో కిడ్నీ జబ్బులు రావడానికి గల కారణాలు తెలియలేదన్నారు.

ఈ నేపథ్యంలో హెచ్ఎంఎస్ సహకారంతో చేసే పరీక్షలతో పాటు జన్యు పరిశోధనలు కీలకం కానున్నాయన్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ బులెటిన్‌లో ఉద్దానం కిడ్నీ వ్యాధులపై తాము చేసిన పరిశోధన పత్రం ప్రచురితమైందని తెలిపారు.

హైవే డ్రైనేజీల్లో పేరుకుపోయిన పూడిక



చిట్టివలస ఈఎస్ఐ ఆస్పత్రిని ఆనుకుని డ్రైనేజీ నుంచి సర్వీస్ రోడ్డుపైకి చేరిన మురుగు

తగరపువలస: స్థానిక జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న సర్వీస్ రోడ్లు మురుగెత్తుతున్నాయి. వీటికి అనుసంధానంగా ఉన్న డ్రైనేజీలు పూడికతో నిండిపోవడమే ఇందుకు కారణంగా కనిపిస్తోంది. జాతీయ రహదారుల నిర్మాణ సమయంలో వినియోగించిన ఫ్లై యాష్ అప్పట్లో వర్షాల కారణంగా డ్రైనేజీల్లో చేరిపోయింది. దానిని తొలగించకుండానే శ్లాబులు వేసేయడంతో మురుగునీటి ప్రవాహానికి తరచూ ఆటంకం కలుగుతోంది. ఆదర్శనగర్ వద్ద ఇటీవల పాక్షికంగా డ్రైనేజీ శ్లాబులను తొలగించి పూడికతీసి వదిలేశారు. డ్రైనేజీ పైకప్పు నిర్మాణం పలకల రూపంలో కాకుండా ఏకంగా శ్లాబు వేయడంతో పూడిక తొలగింపు పూర్తిగా సాధ్యపడడం లేదు. బంగ్లామెట్ట నుంచి వలందపేట వరకు దారి పొడవునా పూడికతో నిండిన డ్రైనేజీల కారణంగా మురుగునీరు సర్వీస్ రోడ్లపై నుంచి పారుతోంది. మొత్తం డ్రైనేజీల్లో పూడిక తొలగింపే మురుగు సమస్య నుంచి శాశ్వత పరిష్కారమని స్థానికులు అంటున్నారు. తక్షణమే పూడిక తొలగింపు చర్యలు చేట్టాలని కోరుతున్నారు.


నోడల్ ఏజెన్సీ ఏర్పాటుకు దరఖాస్తుల ఆహ్వానం

ఏయూక్యాంపస్: విభిన్న ప్రతిభావంతులకు ఉపయుక్తంగా పునరావాస కేంద్రం ఏర్పాటుకు అవసరమైన నోడల్ ఏజెన్సీ స్థాపనకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ సంచాలకులు ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదేశాలకు అనుగుణంగా భారత ప్రభుత్వ సామాజిక న్యాయ, సాధికారత మంత్రిత్వ శాఖ సూచనలతో విభిన్న ప్రతిభావంతులకు వివిధ రకాల సేవలు అందించే విధంగా ఈ కేంద్రం ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. దివ్యాంగుల కోసం పనిచేస్తున్న ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, ప్రభుత్వ, ప్రభుత్వేతర స్వయం ప్రతిపత్తి కలిగిన సంస్థలు ఈ నెల 17వ తేదీలోగా తమ కార్యాలయంలో దరఖాస్తు అందించాలని సూచించారు. వివరాలకు www.socialjustice.gov.in వెబ్‌సైట్‌లో గాని పెదవాల్తేరులోని రాణి చంద్రమణి దేవి ఆసుపత్రి ఆవరణలో ఉన్న సహాయ సంచాలకుల కార్యాలయంలో గాని, 0891–2952585 ఫోన్ నంబర్‌లో గాని సంప్రదించవచ్చన్నారు.

పిస్తోల్ కేసులో చురుగ్గా విచారణ

సీతమ్మధార : మహారాష్ట్ర నుంచి పిస్తోల్‌ను ఒడిశాకు తరలిస్తున్న శ్రీధర్‌హరికిషన్ పతాంగిని ఫోర్తుటౌన్ పోలీసులు కస్టడీకి తీసుకుని విచారించారు. అలాగే పిస్తోల్ ఇచ్చి పంపించిన మహారాష్ట్రలోని జలానా జిల్లాకు చెందిన దత్తపవర్‌ని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారిద్దరినీ ఒకే చోట ఉంచి గురువారం విచారణ చేపట్టారు. అసలు పిస్తోల్ ఎవరు ఇచ్చారు..?, ఎక్కడి నుంచి వచ్చింది..? అన్న కోణంలో ఆరా తీశారు. అయితే ఈ ఇద్దరూ చెప్పిన మాటలకు పొంతన లేకపోవడంతో దత్త పవర్‌ని ప్రత్యేకంగా విచారించారు. సందీప్ అనే వ్యక్తి నుంచి కొనుగోలు చేసినట్లు దత్త పవర్ పోలీసుల విచారణలో చెప్పినట్లు తెలుస్తోంది. ఈ కేసులో రోజుకో కొత్త పేరు వెలుగులోకి రావడం తలనొప్పిగా మారింది. గతంలో ఆత్మరక్షణ కోసమని చెప్పి... ప్రస్తుతం సందీప్ నుంచి కొనుగోలు చేసినట్లు చెప్పడంతో ఆ వ్యక్తిపై పోలీసులు దృష్టి సారించారు.

జాతీయ స్థాయి సదస్సు రేపు



శివానందమూర్తి

డాబాగార్డెన్స్: శివానంద సుపథ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విశాఖలో భారతీయతలో–అమృతకాలం అనే అంశంపై ఈ నెల 10, 11 తేదీల్లో జాతీయ స్థాయి సదస్సు నిర్వహించనున్నట్లు ప్రోగ్రాం కన్వీనర్ ఎస్.రాధాకుమారి తెలిపారు. ఏయూ ఇంజినీరింగ్ కాలేజ్ గ్రౌండ్స్ డాక్టర్ వైవీఎస్ మూర్తి ఆడిటోరియం వేదికగా జరగనున్న సదస్సుకు వివిధ రాష్ట్రాలకు చెందిన ప్రముఖులు, ఆచార్యులు పాల్గొని జ్యోతిష్యం, ఆరాధ్య వ్యవస్థ, ఆలయ వ్యవస్థ, రక్షణ వ్యవస్థ, శిక్షణ వ్యవస్థ, ఆధ్యాత్మికత–భారతీయత, అర్థ వ్యవస్థ ఇలా అనేక అంశాలపై ప్రసంగిస్తారన్నారు. విశాఖలో తొలిసారిగా మానవాళి మనుగడకై వివిధ అంశాలపై నిర్వహిస్తున్న జాతీయ స్థాయి సదస్సుకు నగర వాసులు విచ్చేయాలని కోరారు.